సాక్షి
అనంతపురం

శనివారం । 4 । జనవరి । 2025

I



చీనీ టన్ను రూ.29,190

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.29,190 ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.2°/13.5°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ అధికారులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ చేతుల మీదుగా కళాశాలలో విడుదల చేశారు. మూడో సెమిస్టర్ ఫలితాల్లో బీఏలో 71 శాతం, బీకాంలో 62 శాతం, బీఎస్సీలో 68 శాతం, బీబీఏలో 83 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఐదో సెమిస్టర్‌లో బీఏలో 88 శాతం, బీకాంలో 81 శాతం, బీఎస్సీలో 80 శాతం, బీబీఏలో 92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రామకృష్ణ, పరీక్షల విభాగం అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోజనతో ఫ్రీ హెల్త్ చెకప్‌కు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 'వన్ హాస్పిటల్ – వన్ విలేజ్'లో ఫ్రీ హెల్త్ చెకప్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆరోగ్య యోజనకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య యోజన కింద 6.76 లక్షల మంది లబ్ధిదారులను నమోదు చేయాల్సి ఉండగా.. 6.27 లక్షల మంది నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన వారి నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని మండలాల్లోని సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ కార్డుకు సంబంధించి ప్రత్యేకంగా నమోదు చేయడం ద్వారా లబ్ధిదారులు దేశవ్యాప్తంగా వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. నమోదు, కార్డుల మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లోనూ నమోదు పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలను ఎన్టీఆర్ వైద్యసేవలో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీపీఎం రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ దున్నపోతు మాదే!

- ఇరు గ్రామాల మధ్య రాజుకున్న వివాదం
- ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ముద్దలాపురం గ్రామస్తులు



అనంతపురం: దేవర దున్నపోతు కోసం రెండు గ్రామాల మధ్య వివాదం రాజుకుంది. కూడేరు మండలం ముద్దలాపురంలో ముత్యాలమ్మ, కదరగుంటలో బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగా దేవర నిర్వహణకు గ్రామస్తులు పూనుకున్నారు. ఇందు కోసం దేవరలో బలి ఇచ్చేందుకు గ్రామానికి ఒక దున్నపోతును వదిలారు. ఈ రెండు దున్నపోతులు నాలుగేళ్లుగా సమీప గ్రామాల్లో సంచరిస్తున్నాయి. ఈ నెల 22న దేవర ఉండడంతో ఇటీవల గ్రామంలోకి వచ్చిన దున్నపోతును కదరకుంట గ్రామస్తులు కట్టేశారు. 21వ తేదీన ముద్దలాపురంలో దేవర ఉంది. దీంతో పక్క గ్రామంలో కట్టేసిన దున్నపోతు తమ గ్రామానికి చెందినదేనని ముద్దలాపురం గ్రామస్తులు నిర్ధారణకు వచ్చారు. తమ దున్నపోతును వదిలేస్తే దేవర చేసుకుంటామని కోరగా కదదరకుంట గ్రామస్తులు ఇందుకు ససేమిరా అన్నారు. అది తమదేనని ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో గొడవలు జరిగే అవకాశం కనిపిస్తుండడంతో ముద్దలాపురం గ్రామస్తులు శుక్రవారం ఎస్పీని కలిసేందుకు కార్యాలయానికి వెళ్లారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించే సోమవారం రోజున రావాలంటూ సిబ్బంది సూచించడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆశలు.. ఆవిరి



❒ గడేహోతూరుకు చెందిన ఈ రైతు పేరు రామాంజి. తొమ్మిది ఎకరాల్లో కంది సాగు చేశాడు. రెండు వారాల క్రితం పంటను నూర్పిడి చేయించి ఉరవకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉంచాడు. గిట్టుబాటు ధర వస్తే తనకున్న రూ.2 లక్షల అప్పులు తీర్చి ఇంటి అవసరాలు తీర్చుకుందామనుకున్నాడు. అయితే మార్కెట్లో క్వింటాలు కందులు రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలుకుతోంది. ధర తక్కువగా ఉండడంతో ఆశలు అడియాసలయ్యాయి.



❒ ఈ మహిళా రైతు పేరు గౌరమ్మ. ఉరవకొండకు చెందిన ఈమె తన ఐదెకరాల పొలంలో కంది సాగు చేసింది. పంట నూర్పిడి తర్వాత మార్కెట్‌యార్డుకు తీసుకొస్తే ధరలు ఆశించినస్థాయిలో లేవు. క్వింటాలు రూ.6వేలకు కొంటామని దళారులు చెప్పారు. ఆరుగాలం శ్రమించిన పంటను అయినకాడికి అమ్ముకోవాల్సిందేనా అంటూ గౌరమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఉరవకొండ మార్కెట్‌యార్డులో కందులు ఎండబెట్టిన దృశ్యం

- కంది ధరలు భారీగా పతనం
- మార్కెట్లో పేరుకుపోతున్న నిల్వలు
- గిట్టుబాట ధర కోసం రైతుల ఎదురుచూపు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించని సర్కారు

ఉరవకొండ: కంది ధర భారీగా పతనమైంది. రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన పంటను అయినకాడికి అమ్ముకోలేక గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ కంది సాధారణ సాగు విస్తీర్ణం 37,367 హెక్టార్లు. అయితే ఈసారి రైతులు ఊహించని విధంగా 1,03,429 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో రికార్డుస్థాయిలో కంది వేశారు. గత డిసెంబర్‌లో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చాలాచోట్ల పంట దెబ్బ తినడంతో ఎకరాకు 2 క్వింటాళ్ల మేర దిగుబడి తగ్గింది. అతి కష్టం మీద పంట కోసి నూర్పిడి చేసి విక్రయించేందుకు సిద్ధమవుతున్న సమయంలో మార్కెట్లో ధరలు ఊహించని విధంగా పడిపోయాయి.

దళారులే ధర నిర్ణేతలు

పంట ఉత్పత్తుల ధర నిర్ణయించడంలో దళారుల పాత్రే కీలకం. బహిరంగ మార్కెట్లో పంటకు మంచి ధర పలుకుతున్నా దళారులు మాత్రం తాము చెప్పిన ధరే మార్కెట్లో నడుస్తోందంటూ రైతులను మభ్యపెడుతున్నారు. రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి పంట అమ్ముకోవాలంటే ఖర్చులు పెరుగుతాయి. దీన్ని దళారులు క్యాష్ చేసుకుంటున్నారు. ధర తగ్గించడంతో పాటు ఎలక్ట్రానిక్ కాటాలో చిప్‌లు అమర్చి 50 కిలోల బస్తాలో ఐదారు కిలోలు ఎక్కువ తీసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే వజ్రకరూరు, చాబాల ప్రాంతాల్లో వెలుగుచూశాయి.

కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

కూటమి పాలనలో వ్యవసాయ రంగం కుదేలయ్యింది. పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టి కంది సాగు చేశారు. పంట చేతికివచ్చిన తర్వాత రైతుల నుంచి కొనుగోలు చేయడానికి సర్కారు మాత్రం ఎక్కడా కేంద్రాలను ప్రారంభించలేదు.

కర్ణాటకలో ధర ఆశాజనకం

కంది పంటకు కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, బళ్లారి తదితర ప్రాంతాల్లో క్వింటాలు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. జిల్లాలో ఈసారి పంట దిగుబడితో పాటు నాణ్యత బాగుండడంతో ధర ఆశాజనంగా ఉంటుందని రైతులు సంబరపడ్డారు. అయితే జిల్లాలో కంది క్వింటాలు రూ.6వేల నుంచి రూ.7వేలు మాత్రమే అడుగుతుండటంతో అయోమయ పరిస్థితిలో పడ్డారు. దీంతో పాటు తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో ధరను పూర్తిగా తగ్గిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



కంది పంటను అమ్ముకుందామని మార్కెట్ యార్డుకు వస్తే దళారులు ఇష్టారాజ్యంగా ధరలు చెబుతున్నారు. రైతులకు మద్దతుగా మాట్లాడే నాథుడే లేడు. కనీసం ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– గోవిందు, రైతు, ఉరవకొండ

అవస్థలు పడుతున్నాం



మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో కూడు, నీళ్లు లేకుండా అవస్థలు పడుతున్నాం. రాత్రిళ్లు పంటను కాపాడుకోవడానికి జాగారం చేయాల్సి వస్తోంది. విషసర్పాలతో ఇబ్బంది పడుతున్నాం.

– అందెల నాగరాజు, రైతు, వజ్రకరూరు

25 వరకే సాగునీరు

- హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్



హెచ్చెల్సీ వద్ద రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దవడుగూరు : తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు ఈ నెల 25 వరకే సాగునీరందిస్తామని ఎస్ఈ రాజశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దవడుగూరు మండలం మిడుతూరు, పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి గ్రామాల సమీపంలోని హెచ్చెల్సీని ఈఈ అబ్దుల్ సలీమ్, డీఈ వెంకటరమణారెడ్డితో కలిసి ఎస్ఈ పరిశీలించారు. యాడికి మండలం రాయలచెరువుకు నీరు అందించడానికి అధికారులు తీసుకున్న చర్యలను గురించి ఆరా తీశారు. గురువారం సాయంత్రం నుంచి 17వ కాలువకు నీరు రాకపోవడంతో లక్ష్మంపల్లి, పెద్దవడుగూరు చిన్న వడుగూరు, దిమ్మగుడి గ్రామాల రైతులు యాడికి కాలువ గేట్ల వద్ద వచ్చారు. అధికారులు సాగునీరు యాడికి మండలానికి తరలించే చర్యలను చూసి.. చివరి ఆయకట్టు రైతుల కడుపులు కొట్టొద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు దిగువకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకున్నారు. రెండు మండలాలకు సాగునీరు అందించడానికి కృషి చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని అన్నారు. కొత్తగా రైతులు పంటలు సాగు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈఈ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎక్సైజ్' నిర్వాకం.. నేరాలకు ఊతం

❒ ఇటీవల అనంతపురం టవర్‌క్లాక్ వద్ద మద్యం సేవించినట్టు ధ్రువీకరించిన ఇద్దరి వ్యక్తులకు, పోలీసులకు మధ్య మాటామాటా పెరిగింది. ఓ వ్యక్తిని మఫ్టీలో ఉన్న పోలీసు బూటు కాలితో తన్నిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది.

❒ వారం కిందట గుత్తిలో ఓ వ్యక్తి పీకల్లోతు మద్యం తాగి చిరు వ్యాపారిని చితకబాదాడు. గాయపడిన ఆ వ్యాపారి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

❒ నాలుగు రోజుల కిందట అనంతపురం శ్రీకంఠం సర్కిల్‌లో ముగ్గురు యువకులు మద్యం సేవించి కానిస్టేబుల్‌కు ఎదురుతిరిగారు. మాటామాటా పెరిగి కొట్టుకునే స్థాయికి చేరుకోగా.. కొందరు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

- పెరుగుతున్న మద్యం ఆధారిత నేరాలు
- విచ్చలవిడి విక్రయాల వల్లే ఈ తరహా కేసులు
- ఎక్సైజ్ అధికారుల నిర్లిప్తతే కారణమంటున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొన్ని నెలలుగా రాజకీయ కక్షలు, దొంగతనాలు తదితర వాటితో పల్లెలు అట్టుడుకుతున్నాయి. దీనికితోడు ఇప్పుడు విచ్చలవిడి మద్యం, గంజాయి కేసులు ఎక్కువయ్యాయి. ఎక్కడ చూసినా బహిరంగ మద్యపానం వల్ల నేరాలు పెరిగాయి. మద్యం మత్తులో పట్టణాలు, పల్లెల్లో నేరాలు చేస్తుండడంతో తరచూ కేసులు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న మద్యం, గంజాయి సంబంధిత కేసులతో సివిల్ పోలీసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



అనంతపురం నగరంలో ఓ వైన్‌షాపు వద్ద ఇదీ పరిస్థితి

చేతులెత్తేసిన ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ అధికారులు రెండు జిల్లాల్లోనూ చేతులెత్తేశారు. స్వయానా ఎమ్మెల్యేలే పర్మిట్ రూములు తెరిచి మద్యం ఏరులై పారిస్తున్నా.. కనీసం కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడుతున్నారు. అనంతపురం జిల్లాలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. ఈ ముగ్గురూ అధికార పార్టీ నాయకుల ప్రభావానికి లోనై విచ్చలవిడి మద్యం విక్రయాలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇక ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. బార్‌లు, వైన్‌షాపుల యాజమాన్యాలతో 'సెటిల్‌మెంట్'లు చేయడమే పనిగా పెట్టుకున్నారని కొందరు బార్ యజమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలా విచ్చలవిడి మద్యం విక్రయాలు, బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేయడంలో ఎక్సైజ్ అధికారుల నిర్లిప్తత వెరసి మద్యం ఆధారిత నేరాలు బాగా పెరిగిపోయాయి. ఈ భారం తమపై పడుతోందని సివిల్ పోలీసులు వాపోతున్నారు. 'మామూళ్లు వారికి, బాధలు మాకా' అంటూ ఓ పోలీస్ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో ...

మద్యం షాపులు	230
బార్‌లు	29
రోజుకు మద్యం వినియోగం విలువ	రూ.6 కోట్లు
రోజుకు సగటున డ్రంకన్ డ్రైవ్ కేసులు	500కు పైనే
మత్తులో జరిగిన గొడవలు, ఇతరత్రా కేసులు సుమారు	200

పెల్లుబుకిన లాయర్ల ఆగ్రహం



జిల్లా పోలీసు కార్యాలయంలోకి చొచ్చుకు వెళుతున్న న్యాయవాదులు

అనంతపురం: సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతికి కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఐదో రోజు శుక్రవారం తారస్థాయికి చేరుకుంది. జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి అనంతపురం రేంజ్ డీఐజీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద న్యాయవాదులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. న్యాయవాదులను డీఎస్పీ వి.శ్రీనివాసరావు అడ్డుకుని నినాదాలు చేయరాదంటూ ఆక్షేపించారు. దీంతో న్యాయవాదుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. తప్పు చేసిన సీఐ శాంతిలాల్‌పై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా న్యాయం కోరుతున్న తమనే ఆక్షేపించడాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. దీంతో న్యాయవాదులతో డీఎస్పీ వాగ్వాదానికి దిగారు. అనంతరం పలువురు న్యాయవాదులు డీఐజీ కార్యాలయానికి చేరుకుని శేషాద్రి మృతికి కారణమైన సీఐ శాంతిలాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ డీఐజీ షిమోషికి వినతిపత్రం అందజేశారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం నశించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, సీనియర్ న్యాయవాదులు గోవిందరాజులు, వెంకట్రాముడు, జనరల్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఉమాపతి, బడా నారాయణరెడ్డి, హనుమన్న, పుల్లయ్య బాబు, బాలకృష్ణ, రాజారెడ్డి, గడియారం మల్లికార్జున శర్మ, పద్మజ, యమున, తదితరులు పాల్గొన్నారు.



డీఐజీ షిమోషీకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

వినూత్నంగా ఆలోచించాలి

- రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి
- జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ ముగింపులో కలెక్టర్ వినోద్‌కుమార్
- రాష్ట్రస్థాయికి తొమ్మిది ప్రాజెక్ట్‌ల ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: కాలానుగుణంగా విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి కొత్త ఆవిష్కరణలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాప్తాడు మోడల్ స్కూల్‌లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025 (సైన్స్‌ఫేర్) నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ అంశాలపై తయారు చేసిన ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. మూడు కేటగిరీల్లో తొమ్మిది (ప్రథమ, ద్వితీయ, తృతీయ) ప్రాజెక్ట్‌లను ఎంపిక చేశారు. వీటిల్లో మొదటి, రెండో స్థానంలో నిలిచిన ప్రాజెక్ట్‌లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయం సాధించాలంటే అనేక అంశాలు ఇమిడి ఉంటాయన్నారు. పాఠ్య పుస్తకాలతోనే కాకుండా ఇంటర్నెట్, ఇతర మార్గాల్లో తాము ఎంచుకున్న అంశాలపై ప్రాజెక్ట్‌లు తయారు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా ప్రాజెక్ట్‌లు రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రదర్శనలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో భిన్నంగా ఆలోచించడమే కాకుండా కృషి, పట్టుదలతో చదువుకున్నప్పుడే లక్ష్యం సాధిస్తారన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లు చాలా బాగున్నాయన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తమ పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారన్నారు. తాము తింటున్న ఆహారం ఎలా తయారవుతుందో కూడా చాలామంది విద్యార్థులకు తెలీదన్నారు. వ్యవసాయం పట్ల కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాస్థాయి ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పరిటాల సునీత రూ.లక్ష విరాళం ప్రకటించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఎంఈఓ మల్లికార్జున, జిల్లా సైన్స్ అధికారి బాలమురళి, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులు, టీచర్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు,



ప్రసంగిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విజేతలు వీరే..

వ్యక్తిగత విభాగంలో : ఆర్.శంకర్‌నాథ్‌రెడ్డి 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ రాప్తాడు (ప్రథమ), బి.వంశీ 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ కసాపురం, గుంతకల్లు (ద్వితీయ), ఎల్.నవిక 8వ తరగతి ఎంపీయూపీఎస్ హొసగుడ్డం, డి.హీరేహాళ్ మండలం (తృతీయ).

గ్రూపు విభాగంలో : పి.గీతారెడ్డి–డి.మహలక్ష్మి 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ హనకనహాల్, కణేకల్లు (ప్రథమ), జె.హర్షిణి–కె.చరిత 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ శనగలగూడూరు, పుట్లూరు (ద్వితీయ), పి.యజ్ఞశ్రీ –సి.మధురిమ 8వ తరగతి ఏపీఎంఎస్ తాడిపత్రి (తృతీయ).

టీచర్స్ విభాగంలో : బండి శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ ఆమిదాల, ఉరవకొండ (ప్రథమ), ఎస్.కృష్ణమోహన్ రెడ్డి జెడ్పీహెచ్ఎస్ పెద్ద ఎక్కలూరు, పెద్దపప్పూరు (ద్వితీయ), బి.మహమ్మద్ రఫి జెడ్పీహెచ్ఎస్ కరుట్ల పల్లి, కూడేరు (తృతీయ).

రోగులను మోసుకెళ్లాల్సిందేనా..?

- ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓ విధుల్లో నిర్లక్ష్యం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

అనంతపుం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పలువురు వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో రోగులు ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది. అవుట్ పేషంట్/ ఇన్‌పేషంట్ రోగులు నడవలేని స్థితిలో ఉంటే వారిని ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షల కోసం వీల్‌చైర్, స్ట్రెచర్‌పై ఆయా విభాగాల వద్దకు ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే అవసరమైన సమయంలో వీరు కనిపించరు. వారికోసం గంటల తరబడి ఎదురుచూడలేక రోగుల సహాయకులే విధిలేని పరిస్థితుల్లో చేతులపై, భుజాలపై మోసుకెళ్తున్నారు. శుక్రవారం కోల్‌కతాకు చెందిన పితుల్ అనే మహిళ అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. ఆమెకు సీటీ, తదితర పరీక్షలు చేయించాలని వైద్యులు సూచించారు. నడవలేని స్థితిలో ఉన్న ఆమెను తీసుకెళ్లడానికి సిబ్బంది ఎవరూ రాకపోవడంతో కుమారుడు సజల్ మొదటి అంతస్తు నుంచి మోసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి తల్లిని మోసుకుని మెట్లు ఎక్కి పై అంతస్తుకు చేర్చాడు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు విమర్శిస్తున్నారు.





వైద్య పరీక్షల అనంతరం తల్లిని మోసుకొచ్చి వార్డుకు చేరుస్తున్న తనయుడు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన చరణ్ తేజ్

బుక్కరాయసముద్రం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్–17 సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు మండల కేంద్రంలోని హైస్కూల్‌కు చెందిన టెన్త్ క్లాస్ విద్యార్థి చరణ్ తేజ్ ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నవంబర్–23 నుంచి 25 వరకూ వజ్రకరూరు మండలంలోని కొనకొండ్లలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. జనవరి–5 నుంచి 9వ తేదీ వరకూ మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్–17 సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు, పీడీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'ఎస్ఎస్‌బీఎన్' 80వ వసంతోత్సవాలు ప్రారంభం



పాఠశాల టీచర్లను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 80వ వసంతోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన తొలిరోజు వేడుకలకు పలువురు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పట్లో ఈ విద్యా సంస్థకు బీజం వేసిన సిరవరం ఆదినారాయణ కృషిని వక్తలు కొనియాడారు. పాఠశాలలో టీచర్లను సన్మానించారు. శని, ఆదివారాల్లో నిర్వహించే జూనియర్ కళాశాల, డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చీకట్లో అక్షరాల విత్తనాలు చల్లి విద్యాకుసుమాలు పూయించగల సమర్థులు వారు. నైరాశ్యపు మేఘాలను చీల్చుకుని హృదయాలలో ఆత్మవిశ్వాస సూర్యుని ఉదయింపజేసుకొని స్ఫూర్తి కిరణాలను ప్రసరింపజేస్తూ చీకటి ప్రపంచపు వెలుగు రేఖలయ్యారు. విధి నిర్దాక్షిణ్యంగా తమ కళ్లను కాటేసినా 'బ్రెయిలీ లిపి' అనే మనో నేత్రం ద్వారా నైరాశ్యాన్ని వీడి విజయాలు సొంతం చేసుకున్నారు. తమదైన స్ఫూర్తిదాయక కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలిచిన అంధుల ఆత్మవిశ్వాసంపై లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– అనంతపురం కల్చరల్

చీకటి ప్రపంచంలో.. వెలుగు రేఖలు

సందర్భం
నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి



- నైరాశ్యం వీడి విజయాలు సొంతం చేసుకుని
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న అంధులు

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అని పెద్దలు అన్నారు. అయితే కంటి చూపు లేకపోయినా తమ పాలిట కల్పతరువులా నిలిచిన బ్రెయిలీ లిపితో ఈ ప్రపంచాన్ని చదివిన అంధులు సాధిస్తున్న విజయాలు, వారి మనోధైర్యం ముందు ఎంతటి వారైనా తలవంచక తప్పదు. వారు సాధిస్తున్న విజయాలను చూస్తే దివ్యదృష్టి ఉందా? అనే అనుమానాలు ఎవరికైనా కలుగక మానదు. కంప్యూటర్ యుగంతో పోటీపడుతూ వారి కోసమే ప్రత్యేకంగా రూపొందించబడిన సాంకేతిక నైపుణ్యంతో అసాధారణ ప్రజ్ఞ కనపరుస్తున్నారు. ఎటువంటి కరెన్సీనైనా ప్రత్యేక చిహ్నాల ద్వారా గుర్తించడం, సెల్‌ఫోన్‌ను, కంప్యూటర్‌ను సులువుగా ఆపరేట్ చేయడం, శబ్దాలను బట్టి కచ్చితంగా దేనినైనా అంచనా వేయడం.. తదితరాలు అంతులేని ఆత్మవిశ్వాసంతో జీవించే అంధులకే సొంతం. ప్రపంచాన్ని చూడలేకపోయినా సకలాంగులకు ఎందులోనూ తాము తీసిపోమని నిరూపిస్తున్నారు.

దృష్టిలోపం అడ్డు కాలేదు



పామిడి మండలం ఎద్దులపల్లి గ్రామానికి చెందిన సుధారాణి, వేణుగోపాలరెడ్డి సంతానమైన పల్లవి, ఆమె అన్న సంజీవరెడ్డి ఇద్దరూ పుట్టుకతోనే అంధులు. చిన్నప్పుడు అనేక ఇబ్బందులు పడినా... సకలాంగులతో పాటూ పోటీపడాలన్న లక్ష్యంతో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. పూణే, ఢిల్లీ, బెంగళూరు, గుజరాత్ ప్రాంతాలలో సాగిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది తమ ధ్యేయమని పల్లవి ఎంతో గర్వంగా చెబుతున్నారు.

అన్నింటా నిష్ణాతుడే



నగరంలో స్థిరపడిన జలంధర్ స్వగ్రామం రామగిరి మండలం పిచ్చిరెడ్డి కొట్టాల. ప్రస్తుతం ఐటీఐలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. బాల్యం నుంచే అన్నింటా నిష్ణాతుడిగా ఎదుగుతూ వచ్చారు. సంగీతంలో దిట్ట. ఇతరులకు భిన్నంగా సొంతంగా పాటలు రచించడం, సంగీతాన్ని సమకూర్చడం, మధురంగా ఆలపించడంలో సకలాంగులతో పోటీ పడుతుంటారు. కీబోర్డుపై ప్రయోగాలు చేస్తున్న ఆయన ఇటీవల హిందీలోని కబీర్ కీ దోహె పద్యాలను తెలుగులోకి అనువదించి రాగయుక్తంగా ఆలపించిన తీరు అందరిని సమ్మోహనపరిచింది.

తల్లి ఆత్మహత్యతో తల్లడిల్లిపోయినా



పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన వెంకటనారాయణ జీవితమంతా కష్టాలు కన్నీళ్లమయమే. పేదరికం కారణంగా పిల్లల ఆకలి చూడలేక చిరుప్రాయంలో ఉన్నప్పుడే తల్లి వెంకటసుబ్బమ్మ ఆత్మహత్య చేసుకుంది. బంధువుల నిరాదరణతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్న గంగరాజు (అంధుడే)తో కలసి చదువుకుని ప్రస్తుతం బుక్కరాయసముద్రం ఎంపీపీ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. స్వయంగా వీఐఈడబ్ల్యూ (వ్యూ) పేరుతో ఎన్జీఓ సంస్థను ప్రారంభించి అంధులకు అండగా ఉంటున్నారు.

అంధుల పాఠశాలను తెప్పించారు



కల్లూరు విజయభాస్కర్... చిన్నప్పటి నుంచే ప్రతిభను సొంతం చేసుకున్న ఆయన ఇంట్లో ముగ్గురు అన్నదమ్ములూ అంధులుగానే జన్మించారు. బాల్యం నుంచి అంధుల విద్యాభ్యాసం ఎంత దుర్భరంగా ఉంటుందో చూశారు కాబట్టి ఉద్యమ స్ఫూర్తితో అనేక విజయాలు సాధించారు. ఉమ్మడి జిల్లాలో ఏకైక అంధుల పాఠశాల హిందూపురంలో ఏర్పాటు కావడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే వికలాంగుల హక్కుల కోసం 1986లో 56 రోజులు నిరాహారదీక్ష చేసి ప్రభుత్వంతో పోరాడి అప్పటి కలెక్టర్ చటర్జీ చొరవతో అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపెట్టారు. ఓ వైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే మరో వైపు జాతీయ అంధుల సమాఖ్యకు అధ్యక్షుడిగా వారి సంక్షేమం కోసం నిత్యం పోరాడుతున్నారు. ఈ క్రమంలో అందరి మన్ననలతో 15 ఏళ్లుగా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగానే కొనసాగుతున్నారు.

అంధుల పట్ల ఆదరణ చూపాలి



అంధుల్లో అంతులేని ఆత్మవిశ్వాసముండే మాట నిజమే కానీ, వారు చాలా మటుకు పేదరికంలోనే ఉంటున్నారు. అలాంటి వారికి 1998లో అమ్మ సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి అండగా ఉంటున్నాం. గతంలో అంధ విద్యార్థులకు 12 ఏళ్ల పాటూ మధ్యాహ్న భోజనం అందించాం. బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి క్రమం తప్పకుండా పుస్తకాలందిస్తున్నాం. ఈ ప్రోత్సాహంతో చాలా మంది ఉన్నతంగా స్థిరపడ్డారు. హాస్టళ్లలో ఉండే అంధులకు దుస్తులు, పాడ్స్‌తో పాటు పేద విద్యార్థుల చదువులకు ఎన్నోసార్లు ఫీజులు కూడా చెల్లించాం. అంధుల పట్ల సమాజం ఆదరణ చూపాలి. వారికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిస్తే అద్భుతాలు చేస్తారనడంలో సందేహం లేదు.

– తరిమెల రమణారెడ్డి, అమ్మ సంస్థ



పరుగు పందెంలో పాల్గొన్న అంధులు

అలరించిన క్రీడా, సాంస్కృతిక సంబరం

అనంతపురం/కల్చరల్: లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా రెండో రోజు శుక్రవారం అంధుల క్రీడా, సాంస్కృతిక సంబరాలు అలరించాయి. జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో సాగుతున్న వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో వివిధ క్రీడా పోటీలు ఆసక్తిగా జరిగాయి. రన్నింగ్‌రేస్, టగ్ ఆఫ్ వార్, డిస్కస్ త్రో, స్కిప్పింగ్, మ్యూజికల్‌చైర్, షాట్‌పుట్ తదితర అంశాల్లో అంధులు పోటాపోటీగా తలపడ్డారు. సాయంత్రం కృష్ణకళామందిరంలో సాంస్కృతిక సంబరాలు మిన్నంటాయి. పలువురు అంధ కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. విజేతలకు శనివారం జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులందిస్తామని సమాఖ్య ప్రతినిధులు విజయభాస్కర్, రవి, అంకిరెడ్డి తెలిపారు.







షాట్‌పుట్ వేస్తున్న అంధ క్రీడాకారుడు, విజయోత్సాహంతో ఆలింగనం చేసుకున్న అంధులు, చెస్‌లో తలపడిన అంధ క్రీడాకారులు

దంపతులను కబళించిన అతి వేగం





రాజశేఖర్‌చౌదరి, సుమలత దంపతులు (ఫైల్)

పెద్దవడుగూరు: అతి వేగం దంపతుల ప్రాణాలను బలిగొంది. వివరాలు... కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ చౌదరి(40), సుమలత(35)దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం పట్టు చీరలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై రాజశేఖర్ చౌదరి, సుమలత యాడికి గ్రామానికి వచ్చారు. పట్టుచీరలు కొనుగోలు చేసిన అనంతరం తిరుగు ప్రయాణమైన వారిని పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలో 67వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఎదురుగా శరవేగంగా వచ్చిన బొలెరో వాహనం (ఏపీ39 సీఎక్స్ 4984) ఢీకొంది. ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం పాలయ్యారు. బొలెరోలో ఉన్న యాడికి నివాసి సాయిమణికంఠకూ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌హెచ్544డి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

శింగనమల: జాతీయ రహదారి 544డి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జేసీ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం శింగనమల క్రాస్, ముచ్చుకోట అటవీ ప్రాంతం, చక్రాయిపేట వద్ద చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్న గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వెంట అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, ఎన్‌హెచ్ఎఐ అధికారులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

భూసమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జేసీ శివ్ నారాయణ్ శర్మ సూచించారు. శింగనమల మండలం పెరవలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అవకాశం ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ జహీర్ అస్లాం, తహసీల్దార్ బ్రహ్మయ్య, సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

'అనంత'లో గ్యాంగ్‌వార్

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- ఆస్తి తగాదాలతో ఇరువర్గాల బాహాబాహీ



దాడికి పాల్పడుతున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలో నివాసముంటున్న మార్వాడి కుటుంబానికి చెందిన అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా రచ్చకెక్కింది. దీంతో ఇరువురి మద్దతుదారులు గ్యాంగ్‌వార్‌ను తలపిస్తూ బాహాబాహీగా తలపడ్డారు. బిహార్ గ్యాంగ్ తరహాలో ఫైటింగ్‌లు, జీపుల్లో మనుషులను ఎత్తుకెళ్లడం వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివరాలు.. అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్ సమీపంలో మరాఠా కుటుంబానికి చెందిన అన్నదమ్ములు హేమారావు, మంగిలాల్ మధ్య ఆస్తి పంపకం విషయంగా వివాదం నెలకొంది. గతేడాది నవంబర్‌లో ఆస్తి పంపకాలు జరిగాయి. అయితే తనకు అన్యాయం జరిగిందని భావించిన హేమారావు.. మంగిలాల్ దుకాణానికి తాళం వేశాడు. దీంతో మంగిలాల్‌కు మద్దతుగా స్నేహితులు అశోక్, విఘ్నేశ్వరరెడ్డి చర్చలకు దిగారు. ఇది సహించని హేమారావు తరఫు వారు దాడులకు తెగబడ్డారు. అకారణంగా తనపై జరిగిన దాడిని విఘ్నేశ్వరరెడ్డి తన బంధువులకు ఫోన్ చేసి తెలిపాడు. దీంతో ఆయన తరఫున వచ్చిన ఆజాద్ నగర్‌కు చెందిన బోయ రాము, సాయికుమార్, జయప్రకాష్ నారాయణ్‌పై కూడా భౌతిక దాడులకు తెగబడి బలవంతంగా కారులో ఎక్కించుకుని అజ్ఞాత ప్రదేశానికి బయలుదేరారు. విషయం పోలీసులకు తెలియడంతో భయపడి నగర శివారులోని హెచ్చెల్సీ వద్ద దించేశారు. తమ గురించి పోలీసులకు తెలిపితే మర్యాదగా ఉండదని హెచ్చరించి దుండగులు వెళ్లిపోయారు. అనంతరం ఓ వర్గం మూడో పట్టణ, మరో వర్గం నాల్గో పట్టణ పోలీసు స్టేషన్లకు చేరుకుని పరస్పర ఫిర్యాదులు చేశారు. అయితే భౌతిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దాడి చేసిన తీరు జనాలను భయభ్రాంతులకు గురిచేసే రీతిలో ఉన్నాయి. ఈ తరహా గ్యాంగ్ వార్‌ల కట్టడికి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరారు.

నార్పల టీడీపీలో ఆధిపత్య పోరు



రంగంలో దిగిన ప్రత్యేక పోలీసు బలగాలు

శింగనమల: నార్పల టీడీపీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. వివరాలు.... నార్పలలోని పాత బస్టాండ్ నుంచి కూతలేరు వంక వరకూ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి టీడీపీలోని ఆలం, ఆకుల వర్గీయులు మండల అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆలం వర్గీయులు బ్రిడ్జి వద్ద డ్రైనేజీ పనులు చేపట్టారు. శుక్రవారం తమకు ఎమ్మెల్యే చెప్పారని ఆకుల వర్గీయులు జేసీబీతో పనులు ప్రారంభించారు. దీంతో ఆలం వర్గీయులు మరో జేసీబీతో పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఓ వైపు ఓ వర్గం, మరో వైపు మరో వర్గం నిలబడి దూషణలకు దిగడంతో పరిస్థితి అదుపుతప్పింది. స్థానిక పోలీసుల నుంచి సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు వెంటనే శింగనమల, బుక్కరాయసముద్రం సీఐలు కౌలుటయ్య, కరుణాకర్, అక్కడి సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు నార్పలకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చించి ఎమ్మెల్యే ఎవరికి చెప్పితే వారే పని చేయాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడితే ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ప్రహరీ కూల్చివేత



కూల్చివేసిన ప్రహరీ

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు చెన్నారెడ్డి ఇంటి ముందున్న ప్రహరీని టీడీపీ కార్యకర్తలు కూల్చి వేశారు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామంలో సీసీ రోడ్డు వేసే నెపంతో ప్రహరీని టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మహబూబ్‌బాషా, కథలప్పతో పాటు మరికొందరు కూల్చివేశారు. బాధితుడి నుంచి సమాచారం అందుకున్న తాడిపత్రి అప్‌గ్రేడ్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం బాధితులను స్టేషన్‌కు పిలుచుకెళ్లి రోడ్డు పనులు అడ్డుకున్నారంటూ టీడీపీ వర్గీయులు చేసిన ఫిర్యాదుపై అక్రమ కేసు బనాయించేందుకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసుల వైఖరిపై బాధిత కుటుంబసభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

బాలికలకు స్వీయరక్షణ నైపుణ్యాలు అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

బుక్కరాయసముద్రం: బాలికలకు స్వీయ రక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొర్రపాడు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మిషన్ శక్తి, కిశోరి వికాసంలో భాగంగా జిల్లాలో 100 పాఠశాలల్లో 50 వేల మంది బాలికలకు 'అనంత బాలికల రక్షణ నైపుణ్యాలు, సెల్ఫ్ అవేర్నెస్, మానసిక సాధికారత, ఓవరాల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీటీ డైరెక్టర్ విశా ఫెర్రర్ హాజరయ్యారు. ముందుగా సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాల బాలికలు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చే విధంగా ఆర్థికాభివృద్ధి సాధించేలా రాణించాలన్నారు. బాల బాలికలు సావిత్రీ బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాలికలు చదువుతో పాటు మంచి ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, మహిళల రక్షణ, ప్రభుత్వ పథకాలు అమలు, తదితర విషయాలను తెలుసుకునేందుకు వర్క్‌షాపు నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నతో చర్చించి జిల్లాలో మంచి పని చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి సదస్సు నిర్వహించామన్నారు. జిల్లాలో 50 వేల మంది బాలికల స్వీయ రక్షణ నైపుణ్యాలు అందించడం కోసం 100 విద్యా సంస్థల్లో మిషన్ శక్తి వికాసం కార్యక్రమంలో రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, సీడీపీఓ శ్రీదేవి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన విశ్రాంత ఉద్యోగులతో కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు

మీ సేవలు అమూల్యం

అనంతపురం అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ మీరు అందించిన సేవలు అమూల్యమని ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖలకు చెందిన 13 మంది అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు..

పలు రైళ్లకు స్టాపింగ్

గుంతకల్లు: ప్రయాణికుల అభ్యర్థన మేరకు గుంతకల్లు డివిజన్ పరిధిలోని కొండాపురం, కోవెలకుంట్ల, జమ్మలమడుగు రైల్వే స్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదలకు అనుమతినిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మచిలీపట్నం–ధర్మవరం–మచిలీపట్నం (17215/16) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొండాపురం రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించారు. అలాగే గుంటూరు–తిరుపతి–గుంటూరు (17261/62) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కోవెలకుంట్ల, జమ్మలమడుగు రైల్వేస్టేషన్లలో నిలుపుదల చేసేందుకు అనుమతులిచ్చారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ రైళ్లు ఆయా స్టేషన్లలో ఆగనున్నాయి.

క్లుప్తంగా

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలచెర్ల గ్రామానికి వైఎస్సార్ సీపీ కార్యకర్త బోయ లింగమయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పాలచెర్ల గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండలంలోని హంపాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జానగొండ విజయ్ కుమార్ గత వారం రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేశారు. అధైర్య పడకండి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

రాప్తాడు రూరల్: కూలి పనులు చేయడం ఇష్టం లేని ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ బీజేపీ కొట్టాలులో నివాసముంటున్న బోయ శ్రీనివాసులు కుమారుడు అజయ్ (22) ఇంటర్ ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో కూలి పనులు చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. అయితే తాను చేస్తున్న పనులపై ఇష్టం లేక కొన్ని రోజులుగా ఎవరితోనూ సరిగా మాట్లాడేవాడు కాదు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అజయ్ గురువారం విషపు మాత్రలు మింగాడు. కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అజయ్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని వనపర్తి వాసి దుర్మరణం

అనంతపురం సిటీ: రైలు ఢీకొని వలస కూలీ మృతి చెందాడు. వివరాలు... తెలంగాణలోని వనపర్తికి చెందిన పెంటయ్య(54) తన భార్య ఎల్లమ్మతో కలసి బతుకు తెరువు కోసం కర్ణాటక ప్రాంతానికి బయలుదేరాడు. ఈ క్రమంలో రాయచూరుకు బస్సులో చేరుకున్న వారు... అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లే రైలు ఎక్కి శుక్రవారం తెల్లవారుజామున అనంతపురానికి చేరుకోగానే దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన మరో రైలు ఢీకొంది. ఘటనలో పెంటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరం ఛిద్రమైపోయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం (44) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో 12 ఏళ్ల క్రితం పిల్లలను పిలుచుకుని భార్య వెళ్లిపోయింది. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం తన తల్లితో పాటు అనంతపురం రూరల్ సిండికేట్‌నగర్‌కు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆరు నెలల క్రితం తల్లి మృతి చెందింది. గురువారం రాత్రి భోజనం ముగించుకుని ఇంట్లో నిద్రించిన ఆయన శుక్రవారం తెల్లవారిన తర్వాత కూడా తలుపు తీయలేదు. చుట్టుపక్కల వారు వెళ్లి పరిశీలించగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. అనంతపురం రూరల్ ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

ఆత్మకూరు: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం వల్ల ఎలాంటి వ్యాధులు సంక్రమించవని తెలిపారు. అంతేకాకుండా ఇళ్లలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదన్నారు. అంతేకాకుండా దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు బాషా, శ్రీధర్ పాల్గొన్నారు.

డేంజర్ మలుపులు

చెరువుకట్ట కింద ప్రమాదకరంగా ఉన్న మలుపుల రహదారి

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో అధికారుల విఫలం



న్యామద్దెల చెరువుకట్ట కింద ఉన్న మలుపు



చిన్నంపేట గ్రామ బస్టాండ్ వద్ద మలుపు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. వాహనదారులు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. న్యామద్దెల గ్రామ సమీపంలో చెరువు కట్టకింద ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. చెరువుకట్ట ప్రారంభం నుంచి ముగింపు వరకు దాదాపు నాలుగైదు ప్రాంతాల్లో మలుపులు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ముష్టికోవెల, సుబ్బరాయనిపల్లి, గువ్వలగొందిపల్లి, చిన్నంపేట గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో చిన్నంపేట మినహా మిగిలిన గ్రామాలకు ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు ఏమాత్రం కనిపించవు. ఈ రహదారిలో కొత్తవారు వాహనాలు నడిపితే అంతే సంగతులు. చెరువుకట్టతో పాటు రహదారికి ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఎలాంటి హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. గతంలో ఈ మలుపుల వద్ద ప్రమాదాలు జరిగినా.. అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇక ఒంటికొండ నుంచి ఆమిదాలకుంట గ్రామాలకు వెళ్లే రహదారిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యామద్దెల చెరువు కట్టపై పెరిగిన కంపచెట్లను తొలగించాల్సిన అవసరం ఉంది. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



న్యామద్దెల చెరువుకట్టపై పెరిగిన కంపచెట్లు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



న్యామద్దెల చెరువు కట్ట కింద మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనదారులు కూడా మలుపుల వద్ద నిదానంగా వెళ్లాలి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి. ఈ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– ముత్యాలు, సీపీఐ నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

కంపచెట్లను తొలగించాలి



న్యామద్దెల గ్రామానికి వెళ్లే రహదారిలో చెరువుకట్ట కింద రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కంపచెట్లను తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఎదురుగా వాహనాలు వచ్చినపుడు రోడ్డు పక్కకు వెళితే కంపలు తగిలి గాయాలు అవుతున్నాయి. కంపచెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారించాలి.

– లింగన్న, సీపీఎం నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

నివేదికలు పంపాం

మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరంగా మలుపులు ఉన్న విషయం వాస్తవమే. రహదారిపై గుంతలు పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. రహదారుల మరమ్మతులకు నివేదికలు తయారు చేసి పంపాం. వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయిస్తాం.

– నారాయణ స్వామి, ఏఈ, పంచాయతీరాజ్ రహదారుల విభాగం

సావిత్రిబాయి జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదయాకమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్త్రీ విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో భర్త జ్యోతిరావుపూలే సహకారంతో తొలుత తను విద్యావంతురాలై, ఉపాధ్యాయురాలై.. ఆ తరువాత ఊరూరా బడులు స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. అటువంటి మహనీయురాలికి అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో తన భర్త జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆనుకునే సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని, వచ్చే జెడ్పీ సర్వసభ్య సమావేశం నాటికి పనులు పూర్తి చేసి లాంఛనంగా ప్రారంభించేలా పట్టుదలతో పని చేస్తున్నట్లు ప్రకటించారు. సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తమ సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో ఏఓలు విజయ భాస్కర్‌రెడ్డి, ధనుంజయ, రత్నాబాయి, శ్రీవాణి, నియాజ్ అహమ్మద్, వలి, కమ్మ నాగరాజు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

రాప్తాడు: సావిత్రి బాయి పూలే మహిళలకు ఆదర్శనీయమని హెచ్ఎం సాంబశివుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ సావిత్రి బాయిపూలే బారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ గంజి లక్ష్మీదేవి, సీనియర్ ఉపాధ్యాయురాలు రోజా రమణి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన సావితిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని మహిళా సమాఖ్య నాయకురాళ్లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షురాలు కమ్మక్క, నాయకురాళ్లు యశోద, లక్ష్మీదేవి, చంద్రిక, స్వాతి, రామాంజనమ్మ, అలివేలు, నాగవేణి, రుక్మిణి, భాను, వరలక్ష్మి, రజియా, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను కలసిన ఐటీ విభాగం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతోంది. పెన్షన్ మినహా మిగతా హామీలను విస్మరించిన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఐటీ విభాగం నాయకులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిని ఆయన నివాసంలో ఐటీ విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో పాటు కరెంటు చార్జీలను విపరీతంగా పెంచి రూ.15 వేల కోట్లకుపైగా ప్రజలపై భారం మోపిందన్నారు. వలంటీర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసే వారికి మరో అవకాశం కల్పిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, నాయకులు శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'తల్లికి పంగనామం పెట్టారు'



నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పేరుతో ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే తల్లులకు పంగనామం పెట్టారు. నాన్నకు ఇంధనం ఇచ్చేపై ఉన్న శ్రద్ధ.. తల్లికి వందనం మీద లేదా? అని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంత రాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడారు. ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఏటా ఇస్తామని చెప్పారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలవుతున్నా 'తల్లికి వందనం'పై ప్రభుత్వం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించడం అన్యాయం చేయడమే అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, మంజునాథ్, సహాయ కార్యదర్శి చందు, నాయకులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతులు



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం బళ్లారి బైపాస్ వద్ద పీఏబీఆర్ నుంచి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన విషయం విదితమే. ఈ మరమ్మతు పనులను డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రామలింగేశ్వర్‌తో కలసి మేయర్ వసీం పరిశీలించారు. నగర ప్రజలకు నీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసేలా చూడాలన్నారు. అదేవిధంగా యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలన్నారు. శనివారం నుంచి నీటి సరఫరా యథావిధిగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబూసలేహా, కమల్‌భూషణ్, రహంతుల్లా, సైఫుల్లాబేగ్, ఈఈ రాధాకృష్ణ, డీఈ నరసింహులు, ఏఈ రాజశేఖర్ రెడ్డి, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైలు దిగబోయి యువకుడి మృతి

తాడిపత్రి రూరల్: వేగంగా వెళుతున్న రైలు నుంచి దిగబోయి ఓ యువకుడు మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని విజయ నగర్ కాలనీకిచ చెందిన మోహన్‌నాయక్ (31) స్థానికంగా ఓ టీ కొట్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తన తల్లి లీలాబాయికి చికిత్స కోసం గురువారం వైఎస్సార్ జిల్లా కడపలోని రిమ్స్ ఆస్పత్రికి పిలుచుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం అదే రోజు సాయంత్రం మంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ రైలుకు తాడిపత్రిలో స్టాపింగ్ లేకపోవడంతో గుత్తి రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి షిర్డీ నగర్ రైలు ఎక్కారు. మహిలా కంపార్ట్‌మెంట్‌లో ఉన్న తల్లి తాడిపత్రి రాగానే రైలు దిగింది. కుమారుడి కోసం జనరల్ కంపార్ట్‌మెంట్ వైపుగా వెళుతుండగా రైలు కదిలింది. నిద్రలో ఉన్న మోహన్‌నాయక్ మేల్కొనేలోపు రైలు చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ దాటుతోంది. దీంతో ప్లాట్‌ఫాంపై రైలు దిగడానికి ప్రయత్నించాడు. రైలు వేగంగా వెళుతుండడంతో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటికే కుమారుడు రైలు దిగలేకపోయాడంటూ తల్లి నుంచి సమాచారం అందుకున్న తాడిపత్రి రైల్వే పోలీసులు సమీపంలోని చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. అయితే అప్పటికే మోహన్‌నాయక్ మృతి చెందినట్లుగా తెలుసుకుని విషయం లీలాబాయికి తెలపడంతో ఆమె బోరున విలపిస్తూ చల్లవారిపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. మృతునికి వివాహం కాలేదు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

అనంతపురం: మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు శుక్రవారం ఈవెంట్స్ నిర్వహించారు. ఈ ప్రక్రియ యావత్తు పారదర్శకంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిని అధికంగా కేటాయించి మహిళా అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



బహుమతులు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం: అకడమిక్ పరంగానే కాకుండా, క్రీడల్లోనూ యువత రాణించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని స్టేడియంలో శుక్రవారం నెహ్రూ యువ కేంద్రం, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించడం కోసం ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలను మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బి.జెస్సీ, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇంచార్జి జి. శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్ పాల్గొన్నారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్కేయూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా శనివారం సాగే హనుమాన్ చాలీసా పారాయణంలో 10 వేల మంది విద్యార్థులు సామూహికంగా పారాయణం చేస్తారు. గత నాలుగు రోజులుగా ఆర్ట్స్ కాలేజీలోని సభా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. హనుమాన్ చాలీసా ప్రచార సమితి, శ్రీపవనసుత యువజన సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంగాధర శాస్త్రి, శ్రీమంత్రాలయ పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రుతీర్థుల స్వామీజీ, హంపీ నుంచి పీఠాధిపతులు విద్యారణ్య భారతీ మహాస్వామి అతిథులుగా విచ్చేస్తున్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ పాములాయి శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల సివిల్స్ బ్యాచ్ విద్యార్థులు యునైటెడ్ సైబర్ ఒలంపియాడ్ (యూసీఓ) పరీక్షలో సత్తా చాటారు. యునిఫైడ్ సైబర్ వారి నుంచి వచ్చిన సర్టిఫికెట్లు, బహుమతులను శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. 67 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. అందరికీ బహుమతులు వచ్చాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కరీముల్లా, డీన్లు ఈశ్వర్‌రెడ్డి, గంగాధర్, చినబాబు, ప్రైమరీ ఇన్‌చార్జ్ వంశీప్రియ, యూసీఓ ఇన్‌చార్జ్ తారాదేవి, నాగార్జున పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంబేడ్కర్ గురుకులాల డీసీఓగా జయలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల (అంబేడ్కర్ గురుకులాలు) ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ)గా కె.జయలక్ష్మి బాధ్యతలు తీసుకున్నారు. నెల్లూరులో ఇన్‌చార్జ్ డీసీఓగా పని చేస్తున్న కె.జయలక్ష్మికి రెగ్యులర్ పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీసీఓగా పని చేస్తున్న ఉదయశ్రీకి రెగ్యులర్ పదోన్నతి కల్పించి వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు. జయలక్ష్మి రెండు రోజుల కిందట రిపోర్ట్ చేసుకోగా.. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డీసీఓ మాట్లాడుతూ అందరి సహకారంతో ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల అభివృద్ధికి, పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 నుంచి 70ఏళ్ల పైబడిన రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు అర్హులు. 40 ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పూర్తి వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125లో సంప్రదించవచ్చు.

విద్యార్థినికి అభినందన

అనంతపురం ఎడ్యుకేషన్: చిన్న వయస్సులోనే పర్యావరణ హితం కోసం పాటుపడుతున్న సుంకర నవనిని స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రులు సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. 'ఏక్ పేడ్ మాకినామ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అనంతపురం కేంద్రీయ విద్యాలయ విద్యార్థిని సుంకర నవని శుక్రవారం సచివాలయంలో మంత్రులను కలిసింది. 'ఏక్ పెడ్ మాకినామ్', 'వన మహోత్సవ్' కార్యక్రమాల ద్వారా పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నామని విద్యార్థిని తెలపగా మంత్రులు అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరపాలి

అనంతపురం టవర్‌క్లాక్: తేజ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్రంగా విచారించి నిజాలు నిగ్గుతేల్చాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. సమగ్రంగా విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బంగారు శంకర్, వీరనాగరాజు, నరేష్ కోడవండ్ల, వేమయ్య పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అనంతపురం అర్బన్: మినీ వెహికిల్స్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మినీ వెహికల్స్ డ్రైవర్ల సంఘాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కళ్యాణదుర్గం బైపాస్ వద్ద స్టాండ్‌ను రాజారెడ్డి ఆవిష్కరించారు. భవన కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. లీటరు డీజిల్, పెట్రోల్‌పై ప్రభుత్వాలు విధిస్తున్న సెస్ నుంచి ఒక్క రూపాయి డ్రైవర్ల సంక్షేమ బోర్డుకు కేటాయించాలన్నారు. ఆ నిధిని డ్రైవర్ల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కృష్ణుడు, ఆటో, లారీ డ్రైవర్ల సంఘాల నాయకులు రాజు, వెంకటేష్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే హస్తకళలను ప్రోత్సహించాలని లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. నగరంలో ఐదు రోజుల పాటూ సాగే హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతకు విచ్చేసిన హస్తకళాకారుల అల్లికల ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. లేపాక్షి సిబ్బంది సురేష్, అమరనాథ్, నాగార్జున, సుహాసిని, పూర్ణిమ పాల్గొన్నారు.

● ఆకాశంలో అద్భుతం

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. నెలవంకకు దగ్గరగా చుక్క ఉండడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సుందర దృశ్యాన్ని అనంతపురంలో పలువురు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక దృష్టి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయ అసిస్టెంట్ ఐఈడీ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో సమగ్రశిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య) విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంఈఓలు-1,2లకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, బడి బయట గుర్తించి వారిని బడిలో చేర్పించే అంశాలపై మల్లికార్జున అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తూ.. వారిని భవిత కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచానికే పరిమితమైన పిల్లల విషయంలోనూ ప్రభుత్వాలు చొరవ చూపుతున్నాయన్నారు. ప్రతి శనివారం ఆయా పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి కనీసం దైనందిన కార్యక్రమాలు చేసుకునేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఇస్తున్న అలవెన్సులు, ఇతర సౌలభ్యాలను వివరించారు. ఐఈడీ కోఆర్డినేటర్ పెద్దయ్య పాల్గొన్నారు.

నదుల అనుసంధాన ప్రాజెక్టును కేంద్రమే చేపట్టాలి

గుంతకల్లు: గోదావరి-కృష్ణ నదుల అనుసంధాన ప్రాజెక్టు పనులను కేంద్ర ప్రభుత్వమే చేపట్టి పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 90 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన నదుల అనుసంధాన ప్రక్రియ పూర్తయితే దాదాపు 300 టీఎంసీల నీటిని రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం ఉందన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతాం వ్యవసాయం పరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాబట్టి ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయడమే సబబుగా ఉంటుందన్నారు. ఈ విషయంగా అవసరమైతే అఖిల పక్షాలను కలుపుకోవాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తమిళనాడు తరహాలో ఏపీ ప్రభుత్వం కూడ ఆదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ అధ్యక్షులు గోపీనాథ్, రాముదాయల్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకుడు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ వినోద్ పాల్గొన్నారు. అర్హులైన

న్యూస్‌మేకర్స్



గ్రీన్ ఆర్మీ

ఉత్తరప్రదేశ్‌లో గతంలో 'గులాబ్ గ్యాంగ్' ఘనత విన్నాం. ఇప్పుడు 'గ్రీన్ ఆర్మీ'. స్త్రీల మీద జరిగే దురాగతాలను స్త్రీలే ఉమ్మడిగా ఎదిరిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. వారణాసిలో క్రియాత్మకంగా ఉన్న 'గ్రీన్ ఆర్మీ' మహిళా బృందాన్ని ప్రధాని మోదీ ఇటీవలి మన్‌కీ బాత్‌లో ప్రశంసించారు.

ఇది ఓ జనతా గ్యారేజ్



వాళ్లంతా ఒక 50 మంది ఉంటారు. ఆకుపచ్చ చీరల్లో, చేతి కర్రతో వరుసగా నడుస్తూ ఊళ్లోకి వస్తారు. ఇక ఊళ్లోని మగాళ్లకు గుండె దడే. భార్యలను కొట్టే వాళ్లు, తాగుబోతులు, పేకాట రాయుళ్లు, మత్తు పీల్చేవాళ్ళు, కట్నం కోసం వేధించే వాళ్లు... ఎక్కడికక్కడ సెట్‌రైట్ కావాల్సిందే. ఎందుకంటే వారు 'గ్రీన్ ఆర్మీ'. అందరి స్క్రూలు టైట్ చేసే ఆర్మీ. అందుకే మొన్నటి 'మన్ కీ బాత్'లో వీరి గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'వీరి ఆత్మనిర్భరతకు, కృషికి అభినందనలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని తెలిపారు. దాంతో గ్రీన్ ఆర్మీలో కొత్త జోష్ వచ్చింది.

వారణాసి చుట్టుపక్కల

గ్రీన్ ఆర్మీ 2014లో పుట్టింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్న రవి మిశ్రా వారణాసి చుట్టుపక్కల పల్లెల్లో ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ ఉత్తర జిల్లాలలో గృహ హింస ఎక్కువగా ఉందని గమనించాడు. స్త్రీలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తే వారు ఆత్మరక్షణ చేసుకోగలరని అనుకున్నాడు. కొందరు విద్యార్థులతో కలిసి నిర్మలాదేవి అనే గృహిణిని గృహ హింసను ప్రతిఘటించమని కోరాడు. రైతు కూలీగా ఆమె సంపాదించేదంతా ఆమె భర్త లాక్కుని తాగేవాడు. కొట్టేవాడు. నిర్మలా దేవి విద్యార్థుల స్ఫూర్తితో ఆత్మరక్షణ నేర్చుకుంది. అంతేకాదు గ్రామంలోని మరికొంతమందిని జమ చేసింది. అందరూ కలిసి ఇక గృహ హింసను ఏ మాత్రం సహించమని ఎలుగెత్తారు. అంతేకాదు.. కర్ర చేతబట్టి మాట వినని భర్తలకు బడితె పూజ చేశారు. నిర్మలాదేవి భర్త దారికొచ్చాడు. దాంతో గ్రీన్ ఆర్మీ పేరు వినపడసాగింది.

270 పల్లెల్లో...

వారణాసిలో, చుట్టుపక్కల జిల్లాల్లో ఇప్పుడు 270 గ్రామాల్లో గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు ఉన్నారు. 2000 మంది స్త్రీలు ఇందులో భాగస్వాములు. ప్రతి ఊరిలో ఇరవై నుంచి యాభై మంది స్త్రీలు ఆకుపచ్చ చీరల్లో దళంగా మారి క్రమం తప్పక ఇంటింటికీ వెళ్లి సమస్యల ఆచూకీ తీస్తారు. వాటికి పరిష్కారాలు వెదుకుతారు. స్త్రీల మీద చెయ్యెత్తడం అనేది వీరు పూర్తిగా ఊళ్లల్లో నిర్మూలించారు. ఇక తాగుడు పరిష్కారం కోసం తాగుబోతులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించారు. పేకాట, డ్రగ్స్‌కైతే స్థానమే లేదు. గ్రీన్ ఆర్మీతో స్థానిక పోలీస్ కాంటాక్ట్‌లో ఉంటుంది. ఎవరైనా గ్రీన్ ఆర్మీకి ఎదురు తిరిగితే పోలీసులు వచ్చి చేయవలసింది చేస్తారు. వరకట్న సమస్య ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. 'మీకు కట్నం ఎందుకు ఇవ్వాలి... సరంజామా ఎందుకివ్వాలి' అని గ్రీన్ ఆర్మీ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దాంతో గొంతెమ్మ కోరికలు పూర్తిగా తగ్గాయి. ఇచ్చింది పుచ్చుకుంటున్నారు.

ఆడపిల్లే అదృష్టం

కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ ఆడపిల్ల పుడితే శోకం వ్యక్తం చేస్తారు. ఏడుస్తూ గుండెలు బాదుకుంటారు. కాని గ్రీన్ ఆర్మీ బయలుదేరి ఈ శోకానికి ముగింపు చెప్పింది. 'ఆడపిల్ల అంటే లక్ష్మీ అని ఇంటికి భాగ్యమనీ బాగా చదివిస్తే సరస్వతి అని, శక్తిలో దుర్గ అని... ఆడపిల్లను మగపిల్లాడితో సమానంగా చూడాల'ని ఇంటింటికి తిరిగి చైతన్యం కలిగించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లులకు రక్షణగా నిలబడ్డారు. ఇవన్నీ సాంఘికంగా చాలా మార్పు తెచ్చాయి. అందుకే ఒక్కరు కాకుండా సమష్టిగా ప్రయత్నిస్తే విజయాలు వస్తాయి. గ్రామీణ జీవితంలో స్త్రీలకు ఇంకా ఎన్నో ఆటంకాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయి. కర్రచేత బట్టి ఆర్మీగా మారకపోయినా స్త్రీలు సంఘాలు ఏర్పరుచుకుంటే సమస్యలు దూరం కాకపోవడం ఉండదు. గ్రీన్ ఆర్మీ ఇస్తున్న సందేశం అదే.

ఈత - ఘనత

55 ఏళ్లు.. 150 కిలోమీటర్లు



కొందరు ఓటమి నుంచి విజయాలు అందుకుంటారు. మరికొందరు తమ జీవితంలో ఎదురైన ప్రతిబంధకాల నుంచి బయటపడేందుకు ఏదో సాధించాలనే తపనతో ముందుకు సాగుతారు. ఆ కోవకు చెందిన వారే స్విమ్మర్ గోలి శ్యామల. సామర్లకోటకు చెందిన శ్యామల భర్త మోహన్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో యానిమేషన్ స్టూడియో పెట్టుకుని పలు సీరియళ్లు, సినిమాలకు పనిచేశారు. దురదృష్టవశాత్తూ స్టూడియో ద్వారా తీవ్రంగా నష్టపోవడంతో మానసికంగా మనోవేదనకు గురయ్యారు. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. 45 ఏళ్ళ వయసులో శరీరం సహకరించని స్థితిలో మనసును మళ్ళించేందుకు హైదరాబాద్‌లో స్విమ్మింగ్ నేర్చుకున్నారు. స్వతహాగా ఆమె స్విమ్మర్ కాదు... అయితేనేం, నాటి మనోవేదనకు ఉపశమనంగా ప్రారంభించిన స్విమ్మింగ్ నేడు ఐదు పదుల వయసులో ఆమెను సముద్రాలు దాటే సాహస యాత్రికురాలిగా తీర్చిదిద్దింది.

150 కిలోమీటర్లు ఏడు రోజుల్లో అలవోకగా..

డిసెంబరు 28న విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఈత ప్రారంభించిన శ్యామల శుక్రవారం కాకినాడ తీరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడుతూ యానిమేషన్ స్టూడియోలో నష్టం రావడంతో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిన తాను మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు స్విమ్మింగ్ ప్రారంభించాననీ, కోచ్ జాన్‌సిద్ధిక్ సహకారంతో జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల స్విమ్ చేసేలా తయారయ్యానని సగర్వంగా చెప్పారు. 2021లో శ్రీలంక నుంచి ఇండియా వరకు రామ్‌సేతు దాటానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశానన్నారు. బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడం ద్వారా ఆసియా స్థాయిలో ఘనత సాధించానన్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈదాలని రెండేళ్ళ కిందటే నిర్ణయించుకున్నానని, అయితే రెండుసార్లు వాతావరణం అనుకూలించలేదనీ, ఎట్టకేలకు డిసెంబర్ 28న చిన్న ఫిషింగ్ బోట్, ఇద్దరు స్కూపర్ డ్రైవర్స్‌తో ప్రారంభించానన్నారు. ఆర్కే బీచ్‌లో సముద్రంలో ప్రవేశించాక మళ్ళీ కాకినాడలో నేలపైకి వచ్చామన్నారు. మొదటి రోజు 7 గంటల్లోనే 30 కిలోమీటర్ల దూరం ఈదానన్నారు. తరువాత నుంచి ఈరోజు వరకు అనేక ఒడుదొడుకులను అధిగమిస్తూ ఈదుకుంటూ వచ్చానన్నారు. తల వెంట్రుకల నుంచి కాలి గోళ్ల వరకు స్విమ్మింగ్ వల్లే ఆరోగ్యం కలుగుతుందని, స్విమ్మింగ్‌ను స్పోర్ట్‌గా కాకుండా సర్వైవల్ స్పోర్ట్‌గానే చెబుతానన్నారు. మహిళలు ఈత చేయడం వలన గైనిక్ సమస్యలు తగ్గుతాయన్నారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి ప్రతినిధి.. కాకినాడ.
ఫోటోలు: విశ్వనాధుల రాజబాబు. కాకినాడ రూరల్



హేళన చేసిన వారే పొగుడుతున్నారు

సముద్రంలో ఈత కోసం తొలి ప్రయత్నం చేసినప్పుడు చాలామంది హేళన చేశారు. కొందరు యూట్యూబ్‌లో కామెంట్లు పెట్టారు. వాటిని పట్టించుకోలేదు. అరేబియా సముద్రం ఈదాను. శ్రీలంక నుంచి ఇండియా ఈత మరపురానిది. మేటి స్ఫూర్తితో లక్షద్వీప్‌లో 18గంటల పాటు 48 కిలోమీటర్లు ఈదాను. వైజాగ్ నుంచి కాకినాడ 150 కిలోమీటర్లు ఈదగలిగినందుకు చాలా హ్యాపీగా ఉంది.

– గోలి శ్యామల – స్విమ్మర్.

● ముగ్గు ముచ్చట



దామరాజు లక్ష్మి
ఆర్.ఆర్.పేట, ఏలూరు.



22 చుక్కలు, 10 వరసలు, 10 వచ్చే వరకు, చుక్క వదిలి చుక్క.





17 చుక్కలు, 5 వరసలు, 5 వచ్చే వరకు, సరి చుక్క.

బెన్నూరి ఉమాదేవి
సికింద్రాబాద్



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

● నగధగలు

బంగారం ఎక్కడైనా బంగారమే



ప్రపంచంలో ఏ దేశంలోనైనా బంగారం అత్యంత విలువైన లోహంగా గౌరవం అందుకుంటోంది. బంగారం స్వచ్ఛత గురించి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క నిష్పత్తిని అనుసరిస్తుంటారు. స్వచ్ఛమైన బంగారం అంటే 24 క్యారట్‌ల బంగారం. ఆభరణం తయారు చేయాలంటే కొన్ని ఇతర లోహాల మిశ్రమాన్ని బంగారంలో కలుపుతారు. బంగారం మెత్తటి లోహం. కాబట్టి ఆభరణం ఆకారం గట్టిదనం కోసం ఇతర లోహాలను కలపాలి. అలా లోహపు మిశ్రమాల కలయిక తర్వాత ఆభరణం తయారు చేయడానికి ఉపయోగించే బంగారం స్వచ్ఛత 22 క్యారట్‌లు ఉంటుంది.

● క్యారట్ అనే పదం అయోమయానికి గురి చేస్తుంది. బంగారం స్వచ్ఛత విషయంలో ఉపయోగించే క్యారట్ అనే పదం ఇంగ్లిష్ అక్షరం 'కె'తో సూచిస్తారు. మరో క్యారట్ రాళ్ల (వజ్రంతో సహా అన్ని రకాల రాళ్లు) బరువును సూచించే పదం. ఈ క్యారట్‌ను 'సి'తో అనే అక్షరంతో సూచిస్తారు. ఒక క్యారట్ అంటే 200 మిల్లీగ్రాములు.

● బంగారం ధర పెరగడం వల్ల ఆభరణాల తయారీలో 22 క్యారట్‌లకు బదులు 18, 14, 9 క్యారట్ స్వచ్ఛతతో ఆభరణాలు చేస్తున్నారు. క్యారట్ స్వచ్ఛత తగ్గేకొద్దీ గట్టిదనం పెరుగుతుంది. వజ్రాలు పొదిగే ఆభరణాలకు సాధారణంగా 18 క్యారట్ బంగారం ఉపయోగిస్తారు. ఇప్పుడు 9 క్యారట్ బంగారంతో కూడా వజ్రాల ఆభరణాలు చేస్తున్నారు.

● తక్కువ క్యారట్ బంగారు ఆభరణాలను కొంటే తిరిగి అమ్మేటప్పుడు ఆ బంగారానికి విలువ రాదనే అపోహ చాలామందిలో ఉంటుంది. నిజానికి మనం కొన్న ఆభరణంలో ఎంత నిష్పత్తి బంగారం ఉందో కరిగించినప్పుడు ఆ మేరకు బంగారమే తిరిగి వస్తుంది. బీఐఎస్ హాల్‌మార్క్ వేసిన 18 క్యారట్ బంగారాన్ని కరిగిస్తే 75 శాతం బంగారం వస్తుంది. అంతకంటే క్యారట్ తగ్గితే ఆ మేరకే బంగారం వస్తుంది. అంతే తప్ప తిరిగి ఏమీ రాదనేది అపోహ మాత్రమే. సర్టిఫికేట్‌లో ఆభరణంలో ఉన్న బంగారం స్వచ్ఛతతో పాటు క్యారట్ వివరం తాలూకు పర్సెంటేజ్ కూడా ఉంటుంది.



– విశేషిణి రెడ్డి,
జీఐఏ జెమ్మాలజిస్ట్

బ్యూటిప్

సిట్రస్ ఫ్రెష్‌నర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మతొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటిరోజు ఉదయం నిమ్మతొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మరసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

● కల్లోల కాలం

ఆ అమ్మ సునామీకి జన్మనిచ్చింది!



సునామీ రాయ్, నమిత రాయ్



**ఎప్పుడూ చూసే సముద్రమే ఆ రోజు కొత్తగా ఉంది.
భయంగా ఉంది.
ఎప్పుడూ నవ్వుతూ పలకరించే సముద్రం
విలయవిధ్వంసానికి సిద్ధంగా ఉంది.
ఆరోజు... ఏ రోజూ మరచిపోలేని రోజు.
సునామీ విశ్వరూపాన్ని చూపిన రోజు.
ఇరవై సంవత్సరాల తరువాత కూడా...
నిన్ననే జరిగినట్లు వెన్నులో చలిపుట్టించే రోజు...**

అండమాన్ నికోబార్‌లోని హట్ బే దీవిలో భీకర అలల ధాటికి నమిత రాయ్ ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. అప్పుడు నమిత వయసు పాతిక సంవత్సరాలు. దిక్కుతోచని పరిస్థితుల్లో పాములకు ప్రసిద్ధి చెందిన అడవిలో ఆశ్రయం పొందారు. ఎటు నుంచి ఏ విషసర్పం వచ్చి ప్రాణం తీస్తుందో తెలియని భయానక పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లోనే ఆ పాముల అడవిలోనే పండంటి పిల్లాడికి జన్మనిచ్చింది నమిత.

ఆ పిల్లాడికి 'సునామీ' అని పేరు పెట్టారు.

రెండు దశాబ్దాల తరువాత మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్లింది నమిత రాయ్...

'ఆ చీకటి రోజును గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒంట్లో వణుకు పుడుతుంది. అప్పుడు నేను గర్భవతిని. రోజువారీ పనులతో బిజీగా ఉన్నాను. ఉన్నట్టుండి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. మా తీరం నుండి మైళ్ళ దూరంలో సముద్రం తగ్గుముఖం పట్టడం చూసి షాక్ అయ్యాను. కొన్ని సెకనుల తరువాత మా దీవి వైపు భారీ సముద్రపు అలలు దూసుకొస్తున్నాయి, ఆ తర్వాత బలమైన ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు కేకలు వేస్తూ గుట్ట వైపు పరుగెత్తడం చూశాను. పానిక్ ఎటాక్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాను.

కొన్ని గంటల తరువాత స్పృహలోకి వచ్చాను. కొండ అడవిలో వేలాది మంది స్థానికుల మధ్య నేను ఉన్నాను. నా భర్త, పెద్ద కొడుకును చూడగానే ప్రాణం లేచి వచ్చింది. మా ద్వీపంలోని చాలా ప్రాంతాలు రాక్షస అలల తాకిడికి నాశనం అయ్యాయి. ఆస్తి అనేది లేకుండా పోయింది.

ఒకరోజు రాత్రి పదకొండు గంటల తరువాత నాకు పురిటినొప్పులు వచ్చాయి. కానీ చుట్టుపక్కల డాక్టర్లు ఎవరూ లేరు. నేను ఒక బండరాయిపై పడుకొని సహాయం కోసం ఏడ్చాను. నా భర్త ఎంత ప్రయత్నించినా వైద్యసహాయం అందలేదు. అడవిలో ఆశ్రయం పొందిన కొందరు మహిళలను నా భర్త వేడుకున్నాడు. వారి సాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సునామీకి జన్మనిచ్చాను.

తిండి లేదు. సముద్రానికి భయపడి అడవి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో నా బిడ్డ బతుకుతాడా అనే బాధ మొదలైంది. కొబ్బరి నీళ్లే ఆహారమయ్యాయి. లాల్ టిక్రీ హిల్స్‌లో నాలుగు రాత్రులు గడిపిన మమ్మల్ని రక్షణ సిబ్బంది కాపాడారు. చికిత్స కోసం నన్ను పోర్ట్ బ్లెయిర్‌లోని జీబీ పంత్ ఆసుపత్రికి ఓడలో తీసుకువెళ్లారు. హట్ బే నుంచి పోర్ట్ బ్లెయిర్‌కు 117 కిలోమీటర్‌ల దూరం. సుమారు ఎనిమిది గంటల సమయం పట్టింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నమిత.

కోవిడ్ మహమ్మారి సమయంలో భర్త లక్ష్మీ నారాయణ మరణించడంతో ఇద్దరు కుమారులు సౌరభ్, సునామీలతో కలిసి పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో నివసిస్తుంది నమితా రాయ్.

నమిత పెద్ద కుమారుడు సౌరభ్ ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సునామీ 'ఓషనోగ్రాఫర్' కావాలనుకుంటున్నాడు.

'మా అమ్మే నాకు సర్వస్వం. ఆమె ధైర్యశాలి. నాన్న చనిపోయాక మమ్మల్ని పోషించడానికి చాలా కష్టపడింది. ఫుడ్ డెలివరీ సర్వీసును నిర్వహించింది. దానికి సునామీ కిచెన్ అని సగర్వంగా పేరు పెట్టింది' అంటున్నాడు సునామీ రాయ్.

'2004లో సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థ లేకపోవడంతో పెద్ద ఎత్తున విధ్వంసం, ప్రాణ నష్టం జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1.400కు పైగా హెచ్చరిక కేంద్రాలు(వార్నింగ్ స్టేషన్స్) ఉన్నాయి. సునామీ నాటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము సర్వసన్నద్ధంగా ఉన్నాం' అంటున్నారు అండమాన్ నికోబార్ దీవుల అడ్మినిస్ట్రేషన్ సీనియర్ అధికారులు.

వంటిల్లు

అరిశెలు



కావలసినవి:
బియ్యం – ఒక కిలో; బెల్లం పొడి – 800 గ్రా.; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి – కేజీ

తయారి:
- బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని జల్లించాలి. పిండి గాలికి పొడిబారకుండా ఒక పాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి.
- ఇప్పుడు పాకం సిద్ధం చేసుకోవాలి. మందపాటి పాత్రలో ఒక గ్లాసు నీరు పోసి బెల్లం పొడి వేసి పాకం వచ్చేదాకా తెడ్డుతో కలుపుతూ మరిగించాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ మీద నుంచి దించేసి బియ్యప్పిండి వేసి ఉండలు కట్టకుండా తెడ్డుతో కలపాలి.
- బాణలిలో నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది కాగిన నెయ్యిలో వేసి దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి.

గమనిక: అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే ముదురు పాకం పట్టాలి.

- ఈ అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: మైదా లేదా గోధుమ పిండి – కేజీ; నువ్వులు – కేజీ; బెల్లం పొడి – 800 గ్రా.; ఏలకులు– 10 గ్రా. జీడిపప్పు– వందగ్రాములు; నూనె– కేజీ;

తయారి:
- పిండిని చపాతీలకు కలుపుకున్నట్లుగా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.
- నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కాస్త పలుకుగా గ్రైండ్ చేయాలి. బెల్లం పొడి, యాలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి.
- గోధుమ పిండిని చిన్న గోళీలుగా చేసుకోవాలి. ఒక్కొక్క గోళీని ప్రెస్సర్‌తో పూరీలా వత్తుకుని దానిని సాంచా (కజ్జికాయ చేసే చెక్క మౌల్డ్) లో పరిచి ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచా మూత వేయాలి.
- సాంచాలో నుంచి తీసి కజ్జికాయను మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి.

ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.